ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మంత్రి

మాట్లాడుతున్న కడియం కావ్య, పక్కన శ్రీహరి

మడికొండ, జూన్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో వరంగల్ ఎంపీ కడియం కావ్య పరిచయ, సన్మాన కార్యక్రమాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. రాజకీయాల్లో కావ్య తన తండ్రికి మించిన రాజకీయవేత్త కావాలని ఆకాంక్షించారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ భారీ మెజార్టీతో విజయాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు అతిథులకు కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఐత ప్రకాశ్‌రెడ్డి, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలి : కలెక్టర్

హనుమకొండ, జూన్ 12: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేకదినం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై డీసీఎల్ రమేశ్‌బాబు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరకాల, హనుమకొండ, కాజీపేట పారిశ్రామిక ప్రాంతాలు, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మికశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. అడిషనల్ డీసీపీ ఎన్ రవి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో పోలీస్ శాఖ సహకారం ఉంటుందన్నారు. పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ హరిప్రసాద్, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జీ రామ్‌రెడ్డి, ఎన్సీఎల్పీ డైరెక్టర్ బుర్ర అశోక్‌కుమార్, బాలల సంక్షేమ సమితి సభ్యులు కజాంపురం దామోదర్, న్యాయ మండలి సభ్యులు ఎం సుభాష్, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి మల్లయ్య, డీఆర్డీఏ ఏవో శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, సునీత, విజయ్‌కుమార్, సిస్టర్ సహాయ, ఎర్ర శ్రీకాంత్, బీ కరుణ పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ

దుస్తులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

గిర్మాజీపేట, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు భారతి చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ బుధవారం రామన్నపేటలోని తన కార్యాలయం ఎదుట జత చొప్పున దుస్తులు పంపిణీ చేశారు. నిరుపేదలకు ప్రభుత్వం స్కూల్ యూనిఫాం అందజేస్తున్న నేపథ్యంలో కరీంనగర్ వాసి యెల్లంకి వెంకటేశం సహకారంతో 25 మంది విద్యార్థులకు సివిల్ డ్రెస్‌లు అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్, వారణాసి, ప్రకాశ్, రాజేశ్ పాల్గొన్నారు.

రేపు వరంగల్ ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

హనుమకొండ చౌరస్తా, జూన్ 12: హైదరాబాద్‌లోని తొషిబా సంస్థలో అప్రెంటీస్ నియామకానికి ఈనెల 14న వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్, వెల్డర్స్, 18 నుంచి 25 ఏళ్లు ఉండాలని సూచించారు.

అంగన్‌వాడీ సెంటర్లలో బడిబాట

కాజీపేట/కరీమాబాద్: కాజీపేట 62వ డివిజన్ సోమిడి సెక్టార్‌లోని రెహమత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, 41వ డివిజన్‌లో సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
jobs Apply Now!
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

CHANGE OF NAME
I Smt. J.PAVANI W/o Ex.No. 14614917W (SEPOY) JEEGURU KUMAR SWAMY R/o H.No. 5-11-429/2, Naimnagar, Post: Vill: Hanumakonda Dist. T.S, PIN: 506 009. I have changed my name J. PAVANI to JEEGURU PAVANI India Solemnly declare.

CHANGE OF NAME
I JEEGURU KUMAR SWAMY S/o KOMARAIAH Ex.No. 14614917W (SEPOY) R/o 5-11-429/2, Naimnagar, Post Vill: Hanumakonda Dist. T. S, PIN: 506009 my minor Daughter name is changed from SHIVANI to J SHIVANI India Solemnly declare.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

WANTED
★ జనగామ జిల్లా కేంద్రంలో జూనియర్ కళాశాలలో విద్యార్థులను అడ్మిషన్స్ చేయడానికి PRO's & Lecturers కావలెను @ 9515137392.
NTW-5699

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కావలెను
★HIV Prevention Programలో పని చేయుటకు అనుభవం గల Female GNM & ORWలు కావలెను. Send your Resume on or before 15/6/2024, rdmm.wgl@gmail.com, Cont: 9849688581, 9959711470.
NTW-323319

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

మోగిన బడిగంట

- పాఠశాలలు పునఃప్రారంభం
- సమస్యలతో విద్యార్థులకు స్వాగతం
- అటకెక్కిన 'మన ఊరు - మన బడి'
- టీచర్ల బదిలీలతో చదువు కొనసాగేనా ?

మర్కజీ స్కూల్‌లో హాజరైన విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : వేసవి సెలవులు ముగియడంతో బడులు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు పిల్లలతో సందడిగా మారాయి. పలు పాఠశాలలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ప్రభుత్వం ఈనెల 6 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగుతున్నది. మరోవైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ కాగా టీచర్లంతా ఇదే పనిలో బిజీగా ఉన్నారు. తమకు ఏ స్థానాల్లో పోస్టింగ్ వస్తుందో అనే ఆందోళనలో ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన 'మన ఊరు-మనబడి' పనుల నిర్వహణ అటకెక్కింది. దాని స్థానంలో తెచ్చిన అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరుకు మాత్రమే అమలవుతున్నది. మన ఊరు-మనబడి కార్యక్రమంలో ఎంపిక చేసిన స్కూళ్లలో రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయగా, అమ్మ ఆదర్శ పాఠశాలలు కింద రూ.25 వేలతో పనులు చేపట్టడం ప్రస్తుత ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

సమస్యల స్వాగతం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలికాయి. జిల్లాలో 492 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో మొత్తం 32,890 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. చాలా స్కూళ్లలో మూత్రశాలలు, మరుగుదొడ్లు సక్రమంగా లేవు. పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. మర్కజీ స్కూల్‌లో విద్యార్థులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. పాఠశాల ఎత్తులో ఉండడం.. నల్లా పైపు కిందకు ఉండడంతో సంపులోకి నీళ్లు రావడం లేదు. శిథిలావస్థకు చేరిన భవనాలు, స్కూళ్లకు కిచెన్ షెడ్లు లేకపోవడం, కొన్ని స్కూళ్లకు విద్యుత్ కనెక్షన్లు లేవు. అదనపు తరగతి గదులు కావాల్సి ఉంది.

ఉపాధ్యాయుల కొరత

పాఠశాలల్లో టీచర్లే లేరని విద్యాశాఖ లెక్కలు తీసిన పరిస్థితుల్లో తెరుచుకున్న చాలా పాఠశాలలు ఒక్క ఉపాధ్యాయుడితో, మరిన్ని సబ్జెక్టు టీచర్లు లేకుండానే కొనసాగుతున్నాయి. విద్యార్థులు లేకున్నా కొందరు టీచర్లు బడులకు వెళ్లారు. హనుమకొండ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు మొత్తం 304 ఉండగా 13,827 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 60 ఉండగా 3,495 మంది, ఉన్నత పాఠశాలలు 128 ఉండగా 15,568 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 2,688 ఉపాధ్యాయులకుగాను ప్రస్తుతం 2,262 మంది ఉన్నారు. ఇంకా 426 మంది ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు విద్యాశాఖాధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

మారిన పాఠశాలల వేళలు

ప్రభుత్వ పాఠశాలల పనివేళల్లో మార్పులు జరిగాయి. ఉదయం 9 గంటలకే బడిగంట మోగింది. ప్రైవేట్ పాఠశాలల్లో 8 గంటలకే తరగతులు ప్రారంభమవుతుంటే ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే 9.30కు మొదలు కావడంపై పాఠశాల విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రాథమిక పాఠశాలలు సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు సాయంత్రం 4.15 గంటల వరకు పనిచేయనున్నాయి. హైస్కూళ్లు మాత్రం ఉదయం 9.30 నుంచి ప్రారంభమవుతాయి.

4వ శనివారం 'నో బ్యాగ్ డే'

ప్రతి నెల 4వ శనివారం నో బ్యాగ్‌డే అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ అరగంట పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాల పఠనం, దినపత్రికలు, మ్యాగజైన్లను చదివించాలని నిర్ణయించింది. టీశాట్ టీవీ పాఠాలను సైతం ప్రసారం చేయనున్నారు. ఈ విద్యాసంవత్సరంలో జనవరి 10 నాటికి విద్యాబోధన పూర్తి చేయాలని అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేయడం విశేషం.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో 32,890 మందికిపైగా విద్యార్థులు చదువుతుండగా 2,353 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 426 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. బడిబాట కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఉపాధ్యాయ బదిలీలు 22న పూర్తవుతాయి. పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్, యూనిఫామ్ అందిస్తున్నాం. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. నాణ్యమైన బోధన అందిస్తాం. గతం కంటే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాం.

– డాక్టర్ ఎండీ అబ్దుల్ హై, జిల్లా విద్యాశాఖాధికారి

ట్రాన్స్‌కో లైన్‌మన్ సస్పెన్షన్

ఎల్కతుర్తి, జూన్ 12: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ట్రాన్స్‌కో లైన్‌మెన్‌ను టీజీఎస్పీడీసీఎల్ అధికారులు బుధవారం సస్పెండ్ చేశారు. ఏఈ మాలోత్ లక్ష్మణ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న గోపాల్‌పూర్‌లో విద్యుత్ మరమ్మతులు చేసేందుకు ఎల్‌సీ తీసుకున్నారు. లైన్‌మెన్ భూక్య ఈర్య విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎల్‌సీ పునరుద్ధరించగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న చిరంజీవి షాక్ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై విచారణ చేసిన అధికారులు లైన్‌మెన్‌ను సస్పెన్షన్ చేస్తూ డీఈ సామ్లానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

వర్ధన్నపేట, జూన్ 12: పట్టణ శివారు కోనారెడ్డి చెరువు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాలబెట్టి అందులోని కాపర్‌వైర్‌ను అపహరించిన ఘటన బుధవారం వెలుగుచూసింది. ఉదయం పలువురు రైతులు పొలాల్లోకి వెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తొలగించి ఉన్నాయి. అనుమానం వచ్చి వారు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించగా అందులోని కాపర్ వైర్‌ను దుండగులు చోరీ చేసినట్లు తెలిపారు.

'108' వాహనంలో ప్రసవం

ఐనవోలు, జూన్ 12: పురిటినొప్పులతో ఉన్న గర్భిణిని దవాఖానకు తలిస్తుండగా.. 108 వాహనంలో ప్రసవించింది. సిబ్బంది తల్లీబిడ్డను కాపాడారు. మండలకేంద్రానికి చెందిన బరిగెల జ్యోతికి పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బంది ఈఎంటీ సుధ, పైలెట్ సుధాకర్, ఆశ కార్యకర్త మంజుల, కుటుంబ సభ్యులు దవఖానకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపి ఆమెకు పురుడు పోశారు. జ్యోతి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

రహదారి పక్కన బోల్తా పడిన భారీ వాహనం

భారీ వాహనం బోల్తా

శాయంపేట, జూన్ 12 : మండలంలోని మాందారిపేట శివారులో జాతీయ రహదారి పక్కన రెడీమిక్స్ భారీ వాహనం బోల్తా పడింది. భూపాలపల్లి చెల్పూరుకు చెందిన పులసని వెంకటేశ్వరరావుకు చెందిన ఈ వాహనం హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత లారీని పంకజ్‌సింగ్ నడుపుతుండగా అదుపుతప్పి రాంగ్ రూట్లోకి వెళ్లి బోల్తా పడిందని, అతడు స్వల్ప గాయాలతో బయటపడినట్లు ఎస్సై తెలిపారు.

'కారా' అన్యాయంపై ఆరా

రాయపర్తి, జూన్ 12 : మండలకేంద్రానికి చెందిన దంపతులకు ఐదేళ్లుగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) చేసిన అన్యాయంపై బుధవారం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సరితారెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఇప్పటికే ఈ విషయమై డీడబ్ల్యూవో ఈవో రేవతి, ఐసీపీఎస్ రాజు, వరంగల్ అర్బన్ సీడీపీవో ఈశ్వజ, నర్సంపేట ఏసీడీపీవో శ్రీదేవి, వర్ధన్నపేట సీడీపీవో డేబోరా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతితో కూడిన బృందం విచారణ జరిపింది. నివేదికను ఉన్నతాధికారులకు అందించగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి ఆదేశాల మేరకు సరితారెడ్డి గృహాన్ని సందర్శించారు. కాగా, ఆమె వచ్చినప్పుడు కూడా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

క్లాత్ సంచుల పంపిణీ

కాశీబుగ్గ, జూన్ 12: లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో బుధవారం వినియోగదారులకు ఉచితంగా క్లాత్ సంచులను పంపిణీ చేశారు. పర్యావరణ నేషనల్ ఎన్జీవో నెట్వర్క్ పరిధిలోని 13 స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్, డీఎంవో పాలకుర్తి ప్రసాద్‌రావు, కార్యదర్శి ధరవత్ రెడ్డినాయక్, గ్రేడ్–2 కార్యదర్శి రాము, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి సర్కారు పెద్దపీట

- రాష్ట్ర పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- జిల్లాలో 2.15 లక్షల పాఠ్యపుస్తకాల పంపిణీ
- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, జూన్ 12: విద్యారంగ పురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలోని సరస్వతి విగ్రహానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి బడిబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తున్నదన్నారు. జిల్లావ్యాప్తంగా గుర్తించిన పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ తరఫున సర్కారు బడుల్లో డిజిటల్ ఎడ్యుకేషన్ ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఏ నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడాలని కోరారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పాఠశాలల పునఃప్రారంభం రోజే 2.15 లక్షల పాఠ్యపుస్తకాలు, 2.48 లక్షల నోట్‌బుక్స్‌తోపాటు మహిళా సంఘాలతో కుట్టించిన 38 వేల యూనిఫాం విద్యార్థులకు అందించామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించి 448 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో 130 స్కూళ్లలో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చదువుతున్న ఏడు వేల మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈవో వాసంతి, హెచ్ఎంలు పాల్గొన్నారు. అనంతరం ఖుష్‌మహల్ ప్రాంగణంలో వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాన్ని మంత్రి, కలెక్టర్ ప్రారంభించారు.

పలు పాఠశాలల్లో..

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : సిద్దాపూర్, వంగపహాడ్‌లోని పాఠశాలలతోపాటు పర్వతగిరిలోని ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుస్తకాలు పంపిణీ చేశారు. కాగా, సిద్దాపూర్ పాఠశాలలో వేదికపై కాంగ్రెస్ నాయకులు కండువాలు కప్పుకొని కూర్చోవడంతో స్థానికులు అవాక్కయ్యారు. నెక్కొండ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో రత్నమాల, నల్లబెల్లి ప్రభుత్వ పాఠశాలలో జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీ దుగ్యాల జ్యోతి, ఖానాపురం మండలంలోని బుధరావుపేట ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, క్రిస్టియన్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 18వ కార్పొరేటర్ వస్కుల బాబు యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధపెట్టాలి

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్
- మర్కజీ'లో యూనిఫామ్స్ పంపిణీ

మర్కజీ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

హనుమకొండ చౌరస్తా, జూన్ 12: విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కలెక్టర్ యూనిఫామ్స్ అందజేశారు. పాఠశాలల్లో అత్యవసరమైన పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో కలిపి 1000కి పైగా విద్యార్థులు ఉన్నారని, మంచి ఉపాధ్యాయులు ఉన్నందున జిల్లాలోనే మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్స్, టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మొత్తం 37వేల యూనిఫామ్స్ కుట్టించగా జిల్లాలోని ప్రతి పాఠశాలలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జిల్లాలోని 310 పాఠశాలల్లో అత్యవసరమైన తాగునీరు, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కాగా, మర్కజీ పాఠశాలలో నీటి సమస్యపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డీఈవో అబ్దుల్ హై, డిప్యూటీ డీఈవో రాధను కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందించారు. అలాగే, హసన్‌పర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ డీఈవో అబ్దుల్ హైతో కలిసి విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, టెక్స్‌బుక్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

జిల్లాలో పలు చోట్ల..

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : కాజీపేట(జాగీర్) ప్రభుత్వ ఉన్నతపాఠశాలతో పాటు న్యూశాయంపేటలోని పాఠశాలలో ఆర్జేడీ వరంగల్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. శాయంపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ జక్కుల అనిత, కమలాపూర్‌లోని ఎంపీపీఎస్ టాకీస్ ఏరియా పాఠశాలలో డీఆర్డీవో నాగపద్మజ, వేలేరు మండలం మల్లికుదుర్ల పాఠశాలలో జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, వేలేరు ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి పుస్తకాలు పంపిణీ చేశారు. కాగా, భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించి అవగాహన కల్పించారు. గీసుగొండ మండలం వంచనగిరి ప్రభుత్వ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయులు సుందరంగా అలంకరించి స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు.

'ఉద్యమకారులు పింఛన్లు పొందాలి'

హనుమకొండ చౌరస్తా, జూన్ 12: తెలంగాణ 1969 ఉద్యమంలో జైలుశిక్ష అనుభవించిన పోరాటయోధులు పెన్షన్లు పొందాలని తెలంగాణ మూవ్‌మెంట్ డిటెన్యూస్ ఫోరం సంస్థ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ననుమాస స్వామి అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకోసం జైలుకెళ్లిన ప్రతి ఒక్కరూ పెన్షన్లు పొందాలన్నారు. తిప్ప సారయ్య, మాడుగుల అమృతరెడ్డి, కె.కొండయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'భగీరథ' సర్వే పరిశీలన

గీసుగొండ, జూన్ 12 : మండలంలోని ఊకల్, మరియపురంలో మిషన్ భగీరథ నల్లాల సర్వేను జడ్పీ సీఈవో రామిరెడ్డి బుధవారం పరిశీలించారు. సర్వేను వేగవంతం చేసి, నల్లాలు లేని ఇండ్లను గుర్తించాలన్నారు. ఎంపీవో ప్రభాకర్, కార్యదర్శి స్వప్న, శ్రీధర్ పాల్గొన్నారు.

19న జూనియర్ కాలేజీలో జాబ్ మేళా

హనుమకొండ చౌరస్తా, జూన్ 12: ఈనెల 19న హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఐఈవో గోపాల్ తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం కోసం ఇంటర్మీడియట్ సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్‌లో 75శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డీపీవో రోల్‌కు ఎంపిక చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో 2023, 2024లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7569177071 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆగిన ఆస్తి పన్నుల వసూళ్లు

15 రోజులుగా చెల్లింపుదారుల ఇబ్బందులు

వరంగల్, జూన్ 12 : గ్రేటర్ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లు నిలిచాయి. 15 రోజులుగా గ్రేటర్ ఆస్తి పన్నుల వసూళ్లు జరుగడం లేదు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాకుండా ప్రభుత్వ బిల్ కలెక్టర్లు మాత్రమే ఆస్తి పన్నులు వసూళ్లు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో గ్రేటర్ కార్పొరేషన్ 66 డివిజన్లకు 66 మంది బిల్ కలెక్టర్లకు పన్నుల వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9 ఈసేవా కేంద్రాల్లో పన్నులు చెల్లించవచ్చని గ్రేటర్ అధికారులు ప్రకటించారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) వారు కొత్త ప్రోగ్రాం చేయడంలో జాప్యంతో 15 రోజులుగా కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు పూర్తిగా నిలిచాయి. బిల్ కలెక్టర్లకు ఇచ్చిన హ్యాండ్ సెట్‌లకు మ్యాపింగ్ చేయకపోవడంతో వారు సైతం పన్నుల వసూళ్లు చేయడం లేదు. దీంతో సాధారణ రోజుల్లో కనీసం రూ.50లక్షలు ఆస్తి పన్నుల వసూళ్లు జరుగుతుంటాయి. 15 రోజులుగా నయా పైసా వసూలు కాలేదు. దీనిపై అధికారులు స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ డ్రా

హనుమకొండ, జూన్ 12: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బెస్ట్ అవైలబుల్ పథకంలో బుధవారం విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. హాజరైన అదనపు కలెక్టర్ రాధికగుప్తా మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ఒకటవ తరగతికి 87 సీట్లు, 5వ తరగతికి 88 సీట్లకు డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలికలకు 33శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఒకటో తరగతిలో 29 సీట్లు, 5వ తరగతిలో 29 సీట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు నిర్మల, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ఆత్మకూరు, జూన్ 12: మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి బుధవారం 46 మంది లబ్ధిదారులకు రూ.46లక్షల 5వేల 336 విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, మాజీ ఎంపీపీ బీరం సునంద సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్

హనుమకొండ చౌరస్తా, జూన్ 12: కాకతీయ విశ్వవిద్యాలయ వసతి గృహాల నూతన సంచాలకుడిగా గణితశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు ఎల్పీ రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌కుమార్ ప్రస్తుత సంచాలకులు ఆచార్య గాదె సమ్మయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు.

రైతులు విధిగా రసీదులు తీసుకోవాలి

రాయపర్తి, జూన్ 12: మండలంలోని రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు చేసే సమయంలో దుకాణాదారుల నుంచి విధిగా రసీదులు తీసుకోవాలని ఏవో గుమ్మడి వీరభద్రం కోరారు. బుధవారం తిర్మలాయపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ట్రీడి ఇంపాక్ట్ సర్వీసెస్ సంస్థ నేతృత్వంలో పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు–మేలైన యాజమాన్య పద్ధతుల అవలంబనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రీడి ఇంపాక్ట్ సర్వీసెస్ క్లస్టర్ మేనేజర్ వై.సుమనశ్రీ, ఏఈవోలు వేమిరెడ్డి హిమబిందు, కె.సాంబరాజు, చందు రాజు పాల్గొన్నారు.

కిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


సంతోష్‌కుమార్

హసన్‌పర్తి, జూన్ 12: ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నలిగంటి సంతోష్‌కుమార్‌కు గీతం యూనివర్సిటీ(విశాఖపట్టణం) పరీక్షల నియంత్రణ అధికారి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి బుధవారం తెలిపారు. సంతోష్‌కుమార్ 'బ్లడ్ వెసెల్ సిగ్మెంటేషన్ ఫ్రమ్ డయాబెటిక్ రెటినోపతి ఫండస్ ఇమేజెస్ యూజింగ్ సింగులర్ వాల్యూ డికపోజిషన్, మాక్సిమమ్ ప్రిన్సిపల్ కర్వేచర్' అంశంపై తన పరిశోధన చేసినట్లు తెలిపారు.

'డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయాలి'

ఖిలావరంగల్, జూన్ 12: తూర్పు జర్నలిస్టుల కోసం గత ప్రభుత్వం నిర్మించిన 200 డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖను జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు బుధవారం కోటలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బండి రవి, కమటం వేణుగోపాల్, అమీర్, చిన్నబాబు, వంశీ, అనిల్, ప్రభాకర్, గంగరాజు, నితీశ్, నాగరాజు, శ్యామ్, లక్ష్మణ్ ఉన్నారు.

మౌలిక వసతులను వినియోగించుకోవాలి

గిర్మాజీపేట, జూన్ 12: ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు వినియోగించుకోవాలని కృష్ణాకాలనీ హైస్కూల్ హెచ్ఎం గంప అశోక్‌కుమార్ అన్నారు. పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన భువనకృతి, జేఈఈ అడ్వాన్స్‌లో 3,719 ర్యాంక్ సాధించిన మంచాల చంద్రదీప్‌ను కార్పొరేటర్ చింతాకుల అనిల్ సమక్షంలో బుధవారం ఆయన సత్కరించారు. అనంతరం బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

మాట్లాడుతున్న డీఆర్డీవో నాగపద్మజ

కమలాపూర్, జూన్ 12: మండల కేంద్రంలో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ సమావేశం బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో 2023–24లో జరిగిన పనులపై గ్రామాలవారీగా సమీక్షించారు. 333 పనులకు రూ.4.83కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలను సమావేశంలో వివరించారు. అదనపు డీఆర్డీవో శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీవో బాబు, డీపీసీ ఇంచార్జీ నర్సింహారెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, శ్రీధర్‌రావు, సాగరిక, ప్రేమ్‌చందర్ ఉన్నారు.

పారా తైక్వాండోలో గౌతమ్‌యాదవ్‌కు స్వర్ణం

గోల్డ్ మెడల్‌తో గౌతమ్‌యాదవ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో ఈనెల 6 నుంచి 9 వరకు జరిగిన 7వ జాతీయస్థాయి పారా తైక్వాండో సీనియర్ పూమ్‌సే విభాగంలో పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ స్వర్ణ పతకం సాధించాడు. ఆయన పలు జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇస్తూనే శిక్షకుడిగా వ్యవహరిస్తున్నాడు. 2020లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గౌతమ్ తీవ్రంగా గాయపడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితమైనప్పటికీ ఆత్మవిశ్వాసంతో రాష్ట్ర, జాతీయస్థాయి పారా తైక్వాండో పోటీలకు హాజరవుతున్నారు. గౌతమ్‌యాదవ్‌ను రాష్ట్ర తైక్వాండో సంఘం ప్రతినిధులు దిలీప్, గణేశ్ అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఖానాపురం, జూన్ 12: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో అజర దవాఖాన ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా మేనేజర్ వడ్డే రాజశేఖర్ తెలిపారు. బీపీ, షుగర్, గుండె పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.